# కృష్ణుడు వేరు, కృష్ణుని వాణి వేరు కాదు

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించును కాన నిత్యమున్**
**చక్కగ దాని మీరు మనసా స్మరియింపుడు రామనామమున్.**

ప్రేమస్వరూపులారా!

భగవంతుని లీలలుగానీ మహత్తరమైన శక్తిసామర్థ్యములుగానీ గొప్పవి కావని నిందించటము, విమర్శించటము సులభమే! కానీ, భగవత్తత్త్వము తెలుసుకొనుట అతి కష్టము. సర్వత్ర ఉండిన భగవంతుడు సత్యమునందు ఉన్నాడు. అసత్యమునందు ఉన్నాడు. ధర్మమునందు ఉన్నాడు, అధర్మమునందు ఉన్నాడు. మంచిచెడ్డలయందు దైవమున్నాడు. ఇట్టి సర్వవ్యాపకమైన దైవత్వమును మంచి అని, చెడ్డ అని; ఇది దైవమని, ఇది కాదని ఏ విధంగా నిర్ణయించగలరు? మానవుడు ప్రాచీనకాలమునుండి ఆధ్యాత్మికతత్త్వ ప్రభావమును అనేక విధములుగా పరిశోధనలు సల్పి ప్రపంచమునకు దివ్యత్వమును ప్రబోధిస్తూవచ్చాడు. దీనికి ఒక రూపముకలదనియు, దీనికి అనేక సుగుణములున్నవనియు, ఎన్నో ఆదర్శములైన అనుభూతులు నిరూపించుతూ వచ్చారు.

**సర్వమానవులందు ప్రకాశించేది, వికసించేది దివ్యత్వమే!**

ప్రపంచమంతయు మూడు విధములైన కర్మలచే జరుగుచున్నది. సృష్టినిర్మాణము, సృష్టిపోషణ, సృష్టివినాశము వీటిని ఏ దేశమువారైనా ఏకాలమువారైనా ఏసైంటిస్టు అయినా, ఏవేదాంతి అయినా, ఎవరైనా కాదని చెప్పుటకు వీలులేదు. చెప్పలేరు. అయితే, ఇది భగవంతుని తత్త్వమును ప్రబోధిస్తూవస్తున్నది గానీ భగవంతునిమాత్రము చూపలేదు. కాని, భగవంతుని తెలుసుకొనుటకు తగిన ఆధారమును ఇది నిరూపించగలదు. 'ఆ

sri sathyasai vachanamrutam

చెట్టుకొమ్మపై ధ్రువనక్షత్రము కనిపిస్తుంది' అని చెప్పినప్పుడు ఆ చెట్టుకొమ్మను ఆదర్శముగా చేసుకొని ధ్రువనక్షత్రము మనము చూడగలుగుతున్నాము. అదే విధముగా డైరక్టుగా భగవత్తత్త్వమును నిరూపించలేకపోయినా దైవత్వము ఈ విధముగా ఉంటున్నది అనే మార్గమును ప్రబోధిస్తూవచ్చాయి, వేదములు, శాస్త్రములు, ఇతిహాసములు, పురాణములు. దట్టమైన అడవులను చూస్తే చాలా ఆనందము వేస్తుంది. ఎత్తైన కొండలు చూస్తే చాలా ఉల్లాసము కల్గుతుంది. ప్రవహించే నదులు చూచినప్పుడు ఎంతో ఆనందము కల్గుతుంది. ఇవన్నీ భగవంతుని శక్తిసామర్థ్యములను నిరూపించే చిహ్నములు. తారలు వెలుగుతాయి. గ్రహములు తిరుగుతాయి. సూర్యుడు మండుతాడు. గాలి వీచుతుంది. ఇవన్నీ దైవతత్త్వమునకు చిహ్నములే! అగ్నికణమును గుర్తించినప్పుడు అగ్నిస్వభావమునుకూడా మనం గుర్తించవచ్చు. నీటిబిందువును అర్థము చేసుకున్నవాడు గంగానదిని అర్థము చేసుకోగలడు. అదే విధముగా ప్రకృతిస్వభావమును గుర్తించిన, అనంతమైన దివ్యత్వము గుర్తించుటకు వీలవుతుంది. దీనిని పురస్కరించుకొనియే ఉపనిషత్తులు 'అణోరణీయాన్ మహతో మహీయాన్' అని ఉద్ఘాటించాయి. సర్వమానవులయందు వెలిగేది, ప్రకాశించేది, వికసించేది, ఈ దివ్యత్వమే! కానీ, యీనాటి మానవుడు దేహాభిమానమును అభివృద్ధిగావించుకోటంచేత ఆత్మాభిమానమును అర్థము చేసుకోలేకపోతున్నాడు.

**మానవత్వములోని దివ్యత్వమును తెలుసుకోవాలి**

ప్రపంచములో ప్రతి విషయము మనము దైవత్వముగా విశ్వసించి తగిన రీతిగా సత్యాన్వేషణ జరపాలి. ఏమిటి ఈ సత్యాన్వేషణ? ఎక్కడ ఉన్నది ఈ సత్యము? సర్వత్రా ఉన్న సత్యమును అన్వేషించటము ఎందుకు? ఈ సత్యమునందే మనము 'నిజము' అనే దానిని నిరూపిస్తూ వస్తున్నాము. సూర్యుడు ప్రతిదినము తూర్పున ఉదయిస్తున్నాడు, పడమట అస్తమిస్తున్నాడు అంటాం. ఇక్కడే మనము సత్యాన్వేషణ జరపాలి. ఇది నిజమా లేక సత్యమా? నిత్య జీవితములో ప్రాకృతదృష్టితో మనము చూచినప్పుడు తూర్పున ఉదయించటము, పడమట అస్తమించటము, యిది నిజమే! కానీ, పరిశోధన ప్రమాణములలో చక్కగా విచారణ సల్పినప్పుడు ఇది సత్యముకాదు. సూర్యుడు ఒకే

srisathyasaivachanamrutam

స్థలమునందు ఉంటున్నాడు. కదిలే స్వభావము లేదు. భూమి తిరగటంచేత సూర్యుడు తూర్పున ఉదయించినట్లు, పడమట అస్తమించినట్లు మనకు తోస్తున్నాది. ఇదియే సత్యాన్వేషణ! అనగా 'సూర్యుడు కదిలేవాడుకాదు. ఉన్నచోటనే ఉన్నాడు. కదిలేది మనము. మనము కదలటంచేత సూర్యోదయ సూర్యాస్తమయములు మనం కల్గించుకుంటున్నాము', ఈ విధంగా మానవత్వములోని దివ్యత్వమును తెలుసుకోవాలి. దానినే ఉపనిషత్తులు 'నిన్ను నీవు తెలుసుకో'మని చెప్పాయి. దీనికి ఏ జవాబు యివ్వగలవు? 'నీవు ఎవరు' అని ప్రశ్నించినప్పుడు 'నేను ఫలాని దేశస్తుడని, ఫలాని కులస్తుడను, ఫలానివారి కుమారుడను' అని చెప్పినంతమాత్రమున నిన్ను నీవు తెలుసుకున్నవాడవు అవుతావా? ఇది సరైనదికాదు. నిన్ను నీవు తెలుసుకోటమనగా దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అన్నింటికి ఆవలనున్న తత్త్వమును మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. దీనినే వేదాంతము 'నేతి, నేతి' ఇదికాదు, ఇదికాదు అని చెబుతున్నాది. దేహము, మనస్సు, బుద్ధి, చిత్తము, అంతఃకరణ ఇవి అన్నీ కేవలము పనిముట్లు మాత్రమే! దీనికి ఆవల నున్న అన్నింటిని ప్రకాశింపచేసే దివ్యత్వమే నీవు. అయితే ఇట్టి పరిశోధనలు చేయుటకు ప్రారంభించినప్పుడు అనేక కష్టములు, బాధలు, దుఃఖములు సంభవిస్తాయి. దేవాసురులు క్షీరసాగరమును మధించినప్పుడు మొట్టమొదట విషము ఆవిర్భవించింది. తదుపరియే లక్ష్మి, కామధేనువు, ఐరావతము మొదలైన విలువైనవి అందునుండి ఆవిర్భవించాయి. అమృతముకూడా హాలాహలము తరువాతనే వచ్చింది.

**మానవుని హృదయము క్షీరసాగరమువంటిది**

హృదయమనే క్షీరసాగరమును జ్ఞానమనే తత్త్వముచేత మధనము చేయగా చేయగా దయ, కరుణ, సహనము, సానుభూతి, ప్రేమ యిత్యాది విలువైనవి బయటపడతాయి. మానవుని హృదయము క్షీరసాగరమువంటిది. కానీ ఇట్టి క్షీరసాగరము అయిన హృదయము క్షారసాగరముగా మారిపోతూ వస్తున్నాది. కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములనే తిమింగములవంటి క్రూరమృగములు ఈ హృదయములో చేరిపోయినాయి. విలువైన, పవిత్రమైన గుణములు ఉండవలసిన హృదయమందు

sri sathyasai vahamrutam

క్రూరమృగలక్షణాలు ప్రవేశించటంచేత యిది క్షీరసాగరము కాక క్షారసాగరముగా మారిపోయింది. త్యాగరాజు 'క్షీరసాగర శయనా నన్నేలు...' అని పాడినాడు. భగవంతుడు క్షీరసాగర శయనుడు. అనగా ప్రతి ఒక్కరి హృదయమందు ఈ భగవంతుడు పవళించి ఉంటున్నాడు. అతనియొక్క స్వస్థానము అదియే! అందువలననే బలరాముడు వచ్చి కృష్ణునిపైన అనేక విరుద్ధమైన భావములు ప్రబోధించినప్పుడు యశోద చాలా దుఃఖిస్తుంది. బలరాముడు 'అమ్మా! ఇతనికి తిండి లేదా ఇంటిలో? మన యింటిలో పెరుగు, పాలు లేవా? బజారులో మట్టి తింటున్నాడు' అని తంటాలు చెప్పాడు. దైవత్వముయొక్క మాటలు చాలా విచిత్రంగా ఉంటుంటాయి. విచిత్రము మాత్రమేకాదు, అంతరార్థములతోకూడి ఉంటాయి. తల్లి అతని చెవి పట్టుకొని 'కృష్ణా! మన యింటిలో లేదా వెన్న? నేను పెడితే నీకు రుచి ఉండదా? గొల్లలయింటికి పోయి వెన్న తినవద్దు' అని మందలిస్తుంది. నవ్వుకుంటూ కృష్ణుడు వేదాంతార్థము ప్రబోధించే రీతిగా 'అమ్మా మన్ను తినంగ నే శిశువునో వెఱ్ఱినో!' అమ్మా! నేను చిన్న పిల్లవాడనా? లేక కొంటెవాడినా? వెఱ్ఱివాడను కాదు, కాదు' అని చెప్పాడు. అనగా ఏమిటి? తాను సాక్షాత్ భగవంతుడనని indirect గా ప్రబోధిస్తూ వచ్చాడు. దైవత్వము ఈ విధముగా indirect గా బోధిస్తుంది. మానవునికి direct గా చెప్పినప్పుడు వాని ప్రాకృతమైన చింతలు, ప్రాకృతమైన వాసనలు, ప్రాకృతజీవితమునకే పరిమితమై ఉంటాయి. ప్రాకృతమునకు అతీతమైన తత్త్వములు అతనికి ఏమాత్రము అర్థముకావు. ఇవి ప్రవృత్తులు. కానీ అతని చేష్టలు నివృత్తికి సంబంధించినవి. ఇట్టి నివృత్తితత్త్వము గుర్తించవలెనన్న ప్రవృత్తి మార్గములో కొంతవరకు మనం ప్రయత్నము చేయాలి.

**ఆనందము ఆత్మవల్లనే లభ్యమవుతుంది**

మానవత్వములో ఏవిధమైన పరిస్థితియందు ఏ విధమైన ప్రదేశమందు ఏవిధమైన ప్రవర్తనను జరపాలి అనేది కొంత గుర్తించాలి.

**యోగరతోవా భోగరతోవా సంగరతోవా సంగవిహీనః**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం నందతి నందతి నందత్యేవ ॥భజ॥**

యోగులు నిరాడంబరంగా జీవించుతుంటారు. అంతమాత్రముచేత దైవత్వము



sri sathyasai vachanamrutam

ప్రాప్తిస్తుందా? భోగులు సర్వవిధములైన సౌకర్యములచేత తులతూగుతుంటారు. అంతమాత్రముచేత దివ్యత్వము ప్రాప్తిస్తుందా? ఇంతమాత్రముచేత ఆత్మజ్ఞానము ప్రాప్తిస్తుందా? కాదు కాదు. సర్వము భగవదర్పితముగా ఎంచి భగవంతుని హృదయమే నా స్వస్థానము అనే పరిపూర్ణ నమ్మకముతో ఉండినప్పుడే ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. ఆనందము మరొక వస్తుమూలకంగా లభ్యమయ్యేదికాదు. ఆనందము మరొక విషయముతో లభ్యమయ్యేదికాదు. ఆనందము మరొకవ్యక్తితో లభ్యమయ్యేదికాదు. ఆనందము ఆత్మచేతనే లభ్యమవుతుంది. ఆనంద పిపాసి మానవుడు. ఆనందనిలయుడు మానవుడు. ఆనందస్వరూపుడే మానవుడు. అట్టి ఆనందమయుడైన మానవుడు దుః ఖమునకు గురికావటానికి కారణమేమిటి? దేహాభిమానమే దీనికి మూలకారణము. ఈ దేహము వదలి నీవు పోనక్కరలేదు. నీ కర్తవ్యకర్మలు విసర్జించనక్కరలేదు. సర్వకర్మలు అచరిస్తూ సమాజములో జీవిస్తూ సంఘజీవుడై వర్థిల్లుతూ దైవమును నీవు విస్మరించకుండా ఉండాలి. దైవప్రేమరహితుడైన మానవునకు ఎంత సిరిసంపదలుండినా ప్రయోజనములేదు. నిజమైన ఆస్తి, నిజమైన సంపద, నిజమైన ఐశ్వర్యము, నిజమైన ధనము ఒక్క దైవప్రేమ మాత్రమే! దైవప్రేమకు పాత్రుడుకాని మానవుడు ఉండి ప్రయోజనము ఏమిటి? లోకసంబంధమైన ప్రేమలు కదలిపోయే మేఘములవంటివే! క్షణములో వస్తాయి, క్షణములో పోతాయి.

## సర్వులయందున్న చైతన్యమే దైవత్వము

రాకపోకలు లేని శాశ్వతమైన ఆనందమే, శాశ్వతమైన ప్రేమయే, దైవముయొక్క ప్రేమ. ఇట్టి ప్రేమకు పాత్రులు కావాలి. ఆనాటి గోపికలు, గోపాలురు వ్రేపల్లెయందున్న సమస్త ప్రజలు అట్టి ప్రేమకు పాత్రులగుతూ వచ్చారు. కానీ, మానవుని ప్రాకృత బుద్ధులను పురస్కరించుకుని 'కృష్ణుడు ఈ విధంగా చేశాడు, ఆ విధంగా చేశాడ'ని అనేక నిందాస్తుతులు చెబుతూ వచ్చారు. కృష్ణుడు వ్రేపల్లెనుండినది ఐదవ సంవత్సరమువరకు మాత్రమే! అట్టి బాలుడు ప్రవర్తనలో సంఘవిరుద్ధమైన రీతిగా ప్రవర్తించాడని చెప్పటం అర్థములేనిది. మధుర చేరిన తర్వాత తిరిగి వ్రేపల్లెకే రాలేదు. ఇలాంటి పవిత్రమైన దివ్యత్వమును అర్థము

srisathyasaivahini

చేసుకొనలేక 'యద్భావం తద్భవతి' అన్నట్లుగా తమ భావములే భగవంతునిపై ప్రసరింపచేసి తద్వారా భగవంతునికి దూరమైపోతున్నారు. అసలు దైవత్వమంటే ఏమిటనే విషయము మొట్టమొదట గుర్తించాలి. సర్వులయందున్న చైతన్యస్వభావమే దైవత్వము. ఈ చైతన్యముయొక్క స్వభావమును మనం అర్థము చేసుకొనుటకు ప్రయత్నించాలి. ఆ చైతన్యమే చిత్. అదే సర్వమును ప్రకాశింపచేసేది. ఈ హాలులో ఇన్ని తలలు కనిపిస్తున్నాయి. తలలున్నాయి. అదే **being** . ఉన్నదానిని కనిపించేటట్టుచేసేదే ప్రకాశము. ఆ ఉన్నది సత్. ప్రకటింపచేసేది చిత్. ఈ రెండింటిద్వారా మనకు తృప్తి. ఈ తృప్తియే ఆనందము. కాబట్టి సత్‌చిత్ ఆనందములు మన స్వభావమే! మనకంటె వెలుపల లేవు. లోపల, వెలుపల సర్వత్రా నిండినది దివ్యత్వము ఒక్కటే!

**దివ్యత్వమును అర్థము చేసుకుంటే ఎంతో ఆనందము ననుభవించగలరు**

దివ్యత్వము కించిత్తైనా అర్థము చేసుకుంటే ఎంతో ఆనందమును అనుభవించగలరు. అందరూ తెలిసినట్టుగా భావిస్తున్నారు. కానీ ఏమీ తెలియదు. కారణం ఏమిటి? అనుభవించలేకపోవటమే దీనికి కారణము. కలలో చూచిన మేడలు, మిద్దెలు కన్నులు విప్పిన లేవుకదా! ఒకానొక సమయంలో ఒక వ్యక్తి సంసారముపై విరక్తి కలిగి, (కారణం ఏమనగా సంసారం జరుపుకునే ఆర్థికశక్తి లేకపోవటంచేత) ఇల్లువదలి రాత్రికి రాత్రి బయటకు వెళ్లిపోయాడు. అంతో, యింతో ధనము సంపాయించుకొని తిరిగి ఇంటి మార్గము పట్టాడు. ఆ యిల్లు వదలిన సమయంలో ఒక చిన్న కుమారుడు ఉండేవాడు అతనికి. తండ్రి తనపై చూపించే వాత్సల్యముచేత ఎంతో ఆనందముగా కాలము గడిపేవాడు. కాని తండ్రి ఎడబాటుచేత, మనోవ్యధచేత మరణించాడు. కొంతధనము తీసుకొని ఈ తండ్రి తన గ్రామానికి వస్తున్నాడు. ఈ లోపల పెద్ద ఉరుములు, మెరపులతో వర్షము ప్రారంభమైంది. చీకటిలో గ్రామమునకు ప్రయాణము చేయటము మంచిదికాదని ప్రక్క గ్రామములో ఒక సత్రములో నిద్రించాడు. పడుకున్న తక్షణమే అతనికి ఒక స్వప్నము వచ్చింది. ఆయన మహారాజు అయినట్టు బంగారు సింహాసనముపై కూర్చున్నట్లు దాసదాసీలందరు సేవలు సలుపుతున్నట్టు, అతనికి ఆరుమంది బిడ్డలు ఉండినట్లు,

srisathyasaivacharamrutam

వారందరు గొప్పగా ప్రవర్తిస్తునట్లు కల వచ్చింది. తాను ఆనందిస్తున్నాడు. ఆ స్వప్నములో హంసతూలికా తల్పముపై పవళించాడు. ఏ చింతలు లేక ఉన్నాడు. ఈ లోపల పెద్ద ఉరుము ఉరిమింది. తక్షణమే లేచాడు. చూచాడు. 'అయ్యో! యింతవరకు పవళించిన హంసతూలికా పాన్పు ఎక్కడకు పోయింది? నేను గొప్ప మహారాజుగా ఉండినానే, ఆ మహారాజు స్థానము ఎక్కడకు పోయింది? దాసదాసీలు ఎక్కడకు పోయారు', అని విచారణ చేశాడు. ఇదంతా స్వప్నమని నిరుత్సాహపడ్డాడు. ఆరుమంది కుమారులు కనిపించలేదు. తెల్లవారియింటికి వచ్చాడు. యింటికి వచ్చిన పతిని చూచి ఆ ఇల్లాలు ఘొల్లున ఏడ్చింది, పాపం! ఒక వైపున పతి ఇల్లు చేరాడని సంతోషము, మరొక వైపున కుమారుని పోగొట్టుకొంటిని అని దుఃఖము. ఆ తండ్రి 'మన కుమారుడెక్కడ?' అని ప్రశ్నించాడు. నీ వియోగముచేత మరణించినాడని చెప్పింది ఇల్లాలు. స్థంభించిపోయాడు, ఈ వ్యక్తి. ఏమాత్రము దుఃఖము రాలేదు. శిలారూపుడుగా నిల్చిపోయాడు. భార్య 'ఏమండీ! కుమారుడంటే ఎంతో ప్రేమగా ఉండే మీకు కుమారుని మరణవార్త వినగానే ఏమాత్రము దుఃఖము లేకపోతున్నాది. దీనికి కారణం ఏమిటి?' అని అడిగింది. అప్పుడు చెప్పాడు, నిన్నటిదినము రాత్రి నాకు ఒక కల వచ్చింది. అందులో నేను ఒక శ్రీమంతుడను నాకు ఆరుమంది కుమారులు. హంసతూలికాపాన్పుపై పవళించినాను. దాసదాసీలతో సేవలు జరిపించుకున్నాను. కానీ, యిప్పుడు ఆ ఆరుగురు కుమారులు పోయారు. వారు పోయారని వారికోసం ఏడ్చేదా? నిజ జీవితములో ఒక కుమారుడు పోయాడని వీనికోసం ఏడ్చేదా? ఎవరికోసం నేను ఏడ్వాలి? వారందరు స్వప్నములోని పుత్రులు. వీడు జాగ్రతలోని పుత్రుడు. జాగ్రతలో స్వప్నములేదు. కాని స్వప్నములోనూ నేనున్నాను. జాగ్రతలోనూ నేనున్నాను. నేను ఒక్కడినే రైటు. మిగిలినవి అన్నీ నాస్తి. రెండు స్థానములందు ఉన్నవాడను నేను. కనుక నేను omnipresent. అవన్నీ కదలిపోయే మేఘములే! ఇప్పుడు తెలుసుకున్నాను, జగత్తంతా మిథ్య అని.

**అజ్ఞానమును వదలినప్పుడే ఆనందము**

ఈనాటి మానవుడు సరైన ఆనందమును గుర్తించాలంటే మూడు మార్గములలో అన్వేషణ జరపాలి. మొట్టమొదట తెలుసుకోవలసినది, తెలుసుకోవాలి. వదలవలసినది,

వదలాలి. చేరవలసినది, చేరాలి. ఈ మూడింటితో మనకు నిజమైన ఆనందము లభిస్తుంది. తెలుసుకోవలసింది ఏమిటి? 'ఏమిటి ఈ జగత్తు? ఎంతకాలం నేనుండగలను? ఏమి అనుభవిస్తున్నాను?' అని. మన కనులముందు ఎంతమందో పుడుతున్నారు, ఎంతమందో పోతున్నారు. ఇదంతా జ-గత్, రావటం, పోవటం జరుగుతున్నాది. 'ఈ జగత్తుతత్త్వము వచ్చి, పోయేది' అని తెలుసుకున్నప్పుడు మనకానందము వేస్తుంది. ఇంక తెలుసుకోవలసింది తెలుసుకోవాలి. ఇదే మన ప్రపంచము. దీనిని చక్కగా తెలుసుకున్నావు. కానీ వదలవలసింది వదలాలి. ఏమిటి మనం వదలవలసినది? భ్రాంతి! సత్యము కాని దానిని మనము సత్యమని విశ్వసించి దానిని గట్టిగా పట్టుకొని అనేక విధములుగా బాధలకు గురిఅవుతున్నాము. 'ఏదో నన్ను మాయ పట్టుకొని పీడిస్తున్నాదని లేక దుఃఖము పీడిస్తున్నాదని, దుఃఖము నన్ను వదలటం లేదని' మనం భావిస్తున్నాము. దుఃఖమునకు కాళ్లు, కన్నులు, చేతులు ఉంటున్నాయా? నీకున్నాయి కాళ్లు, చేతులు, కన్నులు. నీవు దానిని పట్టావు; అది నిన్ను పట్టలేదు. దుఃఖమునకు ఏవిధమైన అంగములులేవు. లేని అంగములను కల్పించి, నీలోని అంగములను మరపించి అది నిన్ను పట్టి పీడిస్తున్నట్లు భావిస్తున్నావు. కనుక బాధించేది దుఃఖముకాదు. మీరే దుఃఖమును పట్టి బాధపడుతున్నారు. ఇదే అజ్ఞానము. ఈ అజ్ఞానమును వదలాలి. అప్పుడే మనకు ఆనందము. చేరవలసినది ఏమిటి? ఎక్కడనుండి వచ్చామో అక్కడకు చేరాలి.

**ఆత్మనుండి వచ్చిన మనము తిరిగి ఆత్మలో చేరిపోవాలి**

'ఎచ్చటనుండి వచ్చె నచ్చటకేగుట నైజము ప్రాణికోటికిన్' ఆత్మనుండి వచ్చిన మనము ఆత్మను పోయి చేరాలి. అప్పుడే మనకు ఆనందము. దీనినే ఉపనిషత్తులు 'అసతోమా సద్గమయ' అసత్‌నుండి సత్యమును తెలుసుకోవాలి. సత్యము ఉండినప్పుడే అసత్యమనే నీడ మనకు గుర్తవుతున్నాది. 'తమసోమా జ్యోతిర్గమయ' చీకటి అంటే ఏమిటి? వెలుగు అంటే ఏమిటి? ఉన్నది ఒక్కటే! వెలుగు. ఇది కనిపించనప్పుడే dark గా ఉంటున్నాది. ప్రత్యేకంగా చీకటి, ప్రత్యేకంగా వెలుగు లేనే లేదు. 'వెలుగుయొక్క అభావమే చీకటి' అని తెలుసుకొని చీకటిని మనం వదలాలి. వెలుగును మాత్రమే మన దృష్టియందుంచుకోవాలి.

sri sathyasai vahanamrutam

'మృత్యోర్మా అమృతం గమయ' చావు, పుట్టుకలు దేనికి ఉంటున్నాయి? దేహమునకే! నీకు చావులేదు, పుట్టుకలేదు. నీవు పుట్టువాడుకాదు, చచ్చేవాడుకాదు. పుట్టినదే గిట్టుతుంది. దేహమునకు సంబంధించినవి, చావు పుట్టుకలు. ఆత్మకు సంబంధించినవికాదు. ఆత్మ శాశ్వతము. అదే సత్యము, అదే నిత్యము, అదే అమృతత్వము. ఇలాంటి దానిలో మనం ప్రవేశించాలి. అప్పుడే మనకు నిజమైన ఆనందము. నిత్యము మీరు ప్రార్థన చేస్తున్నారు. 'అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ'. కాని, ఈ మూడింటిని మనం తెలుసుకోటంలేదు. తెలుసుకోవలసింది తెలుసుకోవాలి. వదలవలసినది వదలాలి. చేరవలసిన స్థానము చేరాలి. అప్పుడే ఆనందము ప్రాప్తిస్తుంది. అంతవరకు మనకు శాశ్వత ఆనందము రాదు. ప్రాకృతమైన ఆనందమే! అట్టి శాశ్వతమైన ఆనందమునే అమృతత్వము అన్నారు. అదియే నిత్యము. దీనినే వేదములు వర్ణిస్తూ వచ్చాయి. ఏమాత్రము గుణములులేవు. కనుకనే నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, నిర్మల స్వరూపిణం ఆనందం. శాశ్వతానందమును చేరాలనుకుంటే దైవత్వమును మనం విశ్వసించాలి. ఇట్టి దృఢమైన విశ్వాసమును మనం పెంచుకోవాలి.

## కృష్ణతత్త్వము ఆనందమయమైనది

కృష్ణుడు జన్మించాడు. ఎక్కడ జన్మించాడు? ఆస్తిపాస్తులేమి ఉన్నాయి? ఏమీలేవు. జైలులో పుట్టాడు. నందుని ఇంట్లో పెరిగాడు. మధురకు చేరాడు. యితనికి ఏ ప్రోపరిటీ ఎక్కడుంది? ఏ ప్రోపరిటీలేదు. జానెడు భూమిలేదు. నయాపైస బ్యాంకు బ్యాలెన్సులేదు. కాని అతను జగత్తుకు గొప్పవాడైపోయాడు. అనగా ఏమిటి? ఈ ప్రాకృత ఐశ్వర్యము తన ఐశ్వర్యముకాదు. ప్రాకృతమైన ధనము తన ధనముకాదు. ఇవన్నీ కదలిపోయే మేఘములే! శాశ్వతమైన ధనము ఆనందమే! కృష్ణుడు నిరంతరము ఆనందముగా ఉండేవాడు. కృష్ణునికి, రామునికి ఉన్న వ్యత్యాసము మీరు చక్కగా గుర్తించుకుంటే చాలా సులభంగా అర్థమవుతుంది. కృష్ణునికి మొట్టమొదట నవ్వు, తరువాత పని. రాములకు మొట్టమొదట పని, తరువాత నవ్వు. స్త్రీలను ఏడ్పించినవాడు కృష్ణుడు. స్త్రీలకోసం ఏడ్చినవాడు రాముడు.

sri sathyasai vahini amrutam

కాలు తొక్కించుకొని కయ్యానికి పోయినవాడు రాముడు. కాలు తొక్కి కయ్యానికి పోయినవాడు కృష్ణుడు. అందరితో యుద్ధానికి సిద్ధమై అందరిని ఓడిస్తూ వచ్చాడు కృష్ణుడు. త్రేతాయుగమునకు, ద్వాపరయుగమునకు అదే వ్యత్యాసము. కృష్ణతత్త్వము ఆనందమయమైనతత్త్వము. రామతత్త్వము, బాధ్యతాతత్త్వము. సత్యధర్మపరాక్రమములను ఈ జగత్తుకు చాటే నిమిత్తము వచ్చినది, రామాయణము. 'రామ అయనం, రామాయణం'. కృష్ణతత్త్వము అట్లాకాదు. జగత్తుకు బోధించే నిమిత్తము వచ్చినది. తాను దేనిని ఆశించలేదు. దేనిని అంటగట్టుకోలేదు. సర్వము ప్రజలకే అందిస్తూ వచ్చాడు. కంసుని చంపాడు. అతని తండ్రి ఉగ్రసేనునకు రాజ్యము యిచ్చాడు. తాను తీసుకోలేదు. పాండవులపక్షం వహించి కౌరవులను ఓడించి ధర్మరాజుకు పట్టాభిషేకము చేశాడు. తాను ఏదీ కోరలేదు. తాను కిరీటములేని మహారాజు. రాజాధిరాజు. తనకంటూ ఏ రాజ్యములేదు. సర్వులహృదయములు అతని రాజ్యములే! అలాంటి సత్యము ప్రబోధించినది, కృష్ణతత్త్వము.

**ఒక్కొక్క అవతారము ఒక్కొక్క ఆదర్శమునందించే నిమిత్తమై వచ్చినవే!**

నిజముగా విచారము చేసినప్పుడు ఒక్కొక్క అవతారము ఒక్కొక్క ఆదర్శమునందించే నిమిత్తమై ఆవిర్భవించినవే! గోపికలు వచ్చి యశోద దగ్గర complaint చేస్తూ వచ్చారు. కృష్ణుడు తమాషాగా చెప్పినా, యింకేవిధముగా చెప్పినా, అంతా సత్యమే! నవ్వులకైనా అసత్యము చెప్పలేదు. అర్థము చేసుకోలేని వారు కృష్ణుడు చెప్పినది అబద్ధమని అనుకున్నారు. అన్నియుగములందు యిదే రోగము. గోపికలు వచ్చారు,

> **అర్ధరాత్రివేళలో మా మిద్దెలెక్కి వచ్చి కృష్ణుడు**
> **నిద్రపోవు స్త్రీలజడలను కట్టి పరిగెత్తి వచ్చినాడు**
> **తల్లి అడుగవె, తల్లి అడుగవె!**

అని ఫిర్యాదు చేశారు. అప్పుడు యశోద

> **అర్ధరాత్రివేళలో నీకు యితరులయిండ్లలో ఏమి పనిరా**
> **నిద్రపోవు స్త్రీలజడలను కట్టి పరిగెత్తి వచ్చినావట!**
> **కృష్ణా! విడువుమురా...**



sri sathyasai vahini (watermark)

అని గదమాయించింది. కృష్ణుడు నవ్వుతూ చెబుతున్నాడు:

**అమ్మ నేను నీదుపక్కలో కదలనే కదలక పండియుంటినె**
**అర్ధరాత్రివేళలో నేనెప్పుడు వెళ్లి వస్తిని? అమ్మా!**
**తెలుపవే తల్లీ తెలుపవే తల్లీ**

నేను నీ పక్కలోనే ఉన్నాను. నేను ఎప్పుడు వెళ్లి వచ్చాను? నీవే చెప్పు. ఇక్కడ ఉన్నాడు అక్కడ ఉన్నాడు. ఇక్కడ, అక్కడ, ఎక్కడ చూచినా ఒక్కడే! ఆత్మలోనూ తానై ఉన్నాడు. ఇలాంటి మహత్తర తత్త్వములు కృష్ణుడు నిరూపించినవి. మరొక గోపికల గుంపు వచ్చింది.

**గొల్లభామలంతగూడి చల్లనమ్మబోవుచుండగ**
**చల్లబానకు సుంకమిమ్మని చిల్లులు పడగొట్టినాడు**
**అడుగవె తల్లి, అడుగవె...**

అని ఫిర్యాదు చేశారు. అప్పుడు కృష్ణుడు

**దేవునికి పెట్టవలెనని తెస్తూఉంటే**
**దేవుడేమో కొట్టిపోతే తెలియక నామీద వైచిరి**
**తల్లీ తెలియవే తల్లి తెలియవే!**

అని చమత్కారంగా సర్దుబాటు చేయడానికి ప్రయత్నించాడు. 'దేవుడే కొట్టినాడు కానీ, నేను కొట్టలేదు' అన్నాడు. అనగా ఏమి? తాను దేవుడనని indirect గా చెబుతూ వచ్చాడు. భగవంతుని తత్త్వమును తన తత్త్వముగానే నిరూపింప చేసుకొని తల్లికి అర్థమయ్యేరీతిలో చెబుతూ వచ్చాడు. అనేక పర్యాయములు గొల్లయిండ్లకు చేరి పాలు, పెరుగులు భుజించి తప్పించుకుని వచ్చేవాడు. పాలు పెరుగుల స్వరూపము ఏమిటి? పరిశుద్ధమైన తెలుపు. అనగా సాత్త్వికమును అతను ఆశిస్తున్నాడు.

**పెట్టినది తినవు గొల్లలయిండ్లకు పోయి వెన్న**
**పట్టెళ్ళుగా లోగుట్టున తినెదవు నీతో పుట్టెను**
**రట్టెల్ల కృష్ణా!**

srisathyasaivachanamrutam

అని కోపం నటించింది, యశోద. అంతే కాకుండా కృష్ణుని సమీపించి

**నోరంత వెన్నవాసన ఊరంతయు ఆగడంబు**
**ఒకటే రద్దుల్ గోరంతలేవు బాలా!**
**గారాబము మానుమింక కట్టెద రోటన్...**

అని కోప్పడబోయింది. 'ఉరంతా ఒకే అల్లరి చేసి పెడుతున్నావే, మన యింటి వెన్న నీకు రుచించదా? పరులయింటి వెన్నయేనా నీకు రుచి అంత?' అని తల్లి దండిస్తే అప్పుడు చెబుతున్నాడు: 'గోపికల హృదయము పవిత్రమైనది. పరిశుద్ధమైనది, స్వార్థములేనిది. అందువల్ల వాత్సల్యమనే స్వార్థముతో కళంకితముగాని, స్వప్రయోజనములేని గోపికల హృదయమనే వెన్న నేను అపహరిస్తున్నాను', అని తెలియజేశాడు. ఇంకా 'ఎవరి హృదయము పరిశుద్ధముగా ఉందో, ఎవరిది స్వార్థరహితంగా ఉంటుందో, అట్టి హృదయమునే నేను అపహరిస్తాను' అని వివరించాడు. 'చిత్తచోరా యశోదాకే బాల్ నవనీతచోర గోపాల్' అని బాలకృష్ణుని కీర్తిస్తారు కదా! గోపికల చిత్తమనే వెన్నను కృష్ణుడు అపహరిస్తూ వచ్చాడు. లోకులు ఈ విధంగా కృష్ణుడు చోరుడని భావిస్తున్నారు. కానీ, కృష్ణుడు అపహరించినది నవనీతము కాదు; నవనీతములవంటి గోపికల చిత్తములు. అవి పరిశుద్ధమైనవి, నిస్వార్థమైనవి.

**చిత్తశుద్ధిలేని శివపూజ లేల?**
**ఆత్మశుద్ధిలేని ఆచారమదియేల?**
**పాత్రశుద్ధిలేని పాకమదియేల?**
**ఉన్నమాట తెలుపుచున్న మాట.**

పాత్రశుద్ధిలేని పాత్రలో వంట వండి ప్రయోజనం ఏమిటి? చిత్తశుద్ధితో ఒక్కతూరి 'రామా' అని పిలుస్తేచాలు. 'ఏమిరా?' అని పలుకుతాడు, మరి రాముడు. మనలను నిజంగా ఆనందింపచేసేది దైవము ఒక్కడే! యముడు తానే, రాముడు తానే! అందుకోసమే పురందరదాసు చెప్పాడు: 'రాముడు వేరులేడు, యముడు వేరులేడు. యముడు, రాముడు ఇద్దరూ ఒక్కడే! కృష్ణుడు దేవుడని నమ్మిన ఉగ్రసేనునకు దేవునిగా కనిపించాడు.



srisathyasaivachanamrutam

దేవుడుకాదు, శత్రువు అని భావించిన కంసునికి యముడుగా రూపొందాడు. 'దేవుడు లేడు' అని హరినామమే చింతించక తనను ద్వేషించిన హిరణ్యకశిపునకు యముడుగా మారిపోయాడు. నిరంతరము **నారాయణ భజ నారాయణ్ నారాయణ్ భజ నారాయణ్ నారాయణ్ నారాయణ్** అని నారాయణుని చింతించిన ప్రహ్లాదునికి దేవునిగా కనిపించాడు. రామునిపై ద్వేషము పూని రామునితో యుద్ధమునకు సిద్ధమైన రావణునకు యముడుగా మారిపోయాడు. రాముడే తన సర్వస్వమని భావించి శరణాగతి చెందిన విభీషణునకు దేవునిగా కనిపించాడు. కాబట్టి యముడు, దేవుడు రెండుకాదు, ఒక్కడే! వారి వారి భావములే యముడుగాను, దేవుడుగాను కనిపిస్తూ వచ్చాయి.

**భాగవతము అనగా భగవంతుని కథయే!**

కృష్ణుడు సర్వులకు దేవుడుగా కనిపిస్తూ వచ్చాడు. ఒకనాడు గోపికలందరు చాలా అలసిపోయారు. దినము ఈ విధమైన చిలిపి పనులు చేస్తుంటే కృష్ణుని తరుముతూ పోయేవారు. అప్పుడు వారికి జ్ఞానోపదేశము చేస్తూ వచ్చాడు. 'అయ్యో! పాపం! వారు చిత్తశుద్ధిగలవారు, స్వార్థరహితులు, అమాయకులైన గోపికలు. వారిని నేను తప్పించుకొని పోతున్నాను. ఈ తూరి వారికి తప్పక చిక్కిపోవాలి. వారిచేత నేను బంధింపబడాలి. నేను భక్త పరాధీనుడను. అలాంటి నేను భక్తులను కష్టపెట్టటం మంచిదికాదు', అని సంకల్పించుకున్నాడు. కృష్ణుడు వచ్చే సమయాన్ని గోపికలు అందరూ గుర్తించారు. అందరూ soldiers మాదిరి నిల్చారు, ఎట్లా పోతాడో కనిపెట్టాలని. ఉట్టిపైన పాలన్నీ క్రిందపోశాడు. ఆ పాలలో రెండు పాదములు తడుపుతూ వచ్చాడు. ఈ దృశ్యమును చూచి అందరు అతన్ని తరుముకుంటూ వచ్చారు. ఎక్కడకు పరిగెత్తాడో ఎవరికీ తెలియదు. కడపటికి ఆ పాదముల ప్రింటును ఆధారము చేసుకొని కృష్ణుడెక్కడ అని వెతుకుతూ పోయారు. అప్పుడు వారికి జ్ఞానోదయము కల్గింది. 'గోపికలారా! మీరు నా పాదములు ఆశ్రయించండి. అప్పుడు నేను మీకు చిక్కుతాను. నా పాదములను అనుసరించండి, నేను చిక్కుతాను', అనే బోధలుచేసే నిమిత్తమై పాలలో తన పాదములను తడిపి చక్కగా ప్రింటు చేసుకుంటూ వెళ్లాడు. భాగవతమునందు వర్ణింపబడిన భగవత్తత్త్వము హాస్యాస్పదముగా

srisathyasaivachanamrutam

తీసుకునేవారికి హాస్యాస్పదమే! తలలు వేరైన తలంపులు వేరువేరుగా ఉంటాయి. భాగవతము అనగా భగవంతుని కథయే! అట్టి భగవంతుని కథ తెలుసుకోటానికి చక్కని ఆధారము కృష్ణుని లీలలే! గోపికావస్త్రాపరహణ ఘట్టములో కృష్ణుడు చెట్టు ఎక్కాడు. ఎంత పిలిచినా పలకడు. గోపికలు కొలనులోనుండి బయటకు రాలేరు. కట్టకడపటికి రెండు చేతులెత్తి తమ వస్త్రములను తమకు ఇచ్చి వేయమని కృష్ణుని ప్రార్థించినారు. ఏమిటి అంతరార్థము? అభిమానమనునదే వస్త్రము. అభిమానమనే వస్త్రమును మీరు విసర్జించండి. ఆత్మ అనే నేను మీలో ప్రవేశిస్తాను, అని దీని భావము. ఈ విధంగా అనేక విధములైన ఆత్మబోధలు సల్పుతూ వచ్చింది, భాగవతము. ఇట్టి పవిత్రమైన కృష్ణ కథలన్నీ ఎంతో ఆదర్శవంతమైనవే గానీ హాస్యాస్పదమైనవిగానీ, ఆసభ్యమైనవికానీ కాదు. అదే విధముగనే రాధకుకూడా ఎన్నో బాధలు కలిగించి కట్టకడపటకి సముద్రమథనము చేసినట్లు ఆమె హృదయమును మథనము చేసి దివ్యమైన పవిత్రమైన జ్ఞానమనే మణిని అమెకందించాడు. ఆమె బంధువులనుగానీ అక్కచెల్లెంద్రను, అన్నదమ్ములను గానీ ఎవరిని ఆధారం చేసుకోలేదు. తన వేదన అంతా కృష్ణునికే విన్నవించుకుంది:

**నిలువనీడలేని బ్రతుకు నీకొరకని మోయుదాన కృష్ణా**
**నిలువదురా నా మనసు నీ నగవులు దూరమైన**

ఈ నీ నవ్వులు లేకపోతే నా మనస్సు నిలువలేదు

**కలలోనైన కనులకు కానగరారా కృష్ణా!**
**నిన్ను విడచి నే నిలువలేనురా, కానగ రారా!**

చివరకు రాధ దేహమును వదలేముందుగా కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. భక్తునకు చివరకు తన్ను తానే భగవంతుడు అర్పితము చేసుకుంటాడు. యింతటి త్యాగవంతమైన వ్యక్తులుగానీ బంధువులుగానీ జగత్తులో ఎక్కడా కనిపించరు. కట్టకడపటికి రాధకు దేహములోని శక్తి అంతా క్షీణించిపోయింది. ఆ పరిస్థితులలో కృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు. 'రాధా! నీ అంత్యసమయములో ఏమి కావాలి నీకు?' అని ప్రశ్నించాడు. 'నాకేమి వద్దు కృష్ణా! ఒక్కసారి నీ వేణుగానాన్ని వినిపించు' అని వేడుకుంది, రాధ.

sri sathyasai vahanamrutam

**పాట పాడుమా కృష్ణా! పలుకు తేనెలొలుకునటుల**
**మాటలాడుమా ముకుంద మనసు తీరగా....**
**వేదసారమంత తీసి నాదరూపముగను మార్చి**
**వేణువందు తిరుగబోసి గానరూపముగను మార్చి ।పాట।**

'నాలుగు వేదముల సారమంతా తీసి, అదే ఉపనిషత్తుల సారము. ఆ ఉపనిషత్తులే గోవులు, నాలుగు. నా దేహమే నీ వేణువు. నా దేహమనే వేణువునకు నవరంధ్రములుంటున్నాయి. ఆ వేదసారమును ఈ వేణువునందు అటు ఇటు తిరుగపోసి వేణుగానమాలపించు', అని వేడుకుంది. అప్పుడు కృష్ణుడు చివరిసారిగా వేణువును తీసి వినిపించాడు. తరువాత శాశ్వతంగా ఆ వేణువును విడచిపెట్టాడు. ఆనాటినుండి ఆ వేణువును తాను ముట్టనేలేదు. రాధయొక్క ఆనందము నిమిత్తమై తన కత్యంత ప్రీతికరమైన వేణువును అర్పితము చేశాడు.

**కృష్ణుని లీలలన్నీ మానవుల వ్యధలను దూరముగావించేవే!**

ఒకానొక సమయంలో రుక్మిణి, రాధను తన యింటికి పిలిపించింది. రాధ వచ్చింది. ఆనాడు పాలు, పెరుగు, వెన్న ఇవే భక్ష్యభోజ్యములు. ఇడ్లీ, దోశ, కేక్‌లు యిలాంటివి లేవు. రాధ యింటికి వచ్చిందన్న ఆనందముతో నిప్పులపై పొంగుతున్న పాలను తీసి పాత్రలో పోసి రాధకు అందించింది. రాధస్వభావము తాను ఏదైనా భుజించేముందు ఆ పదార్థమును కృష్ణునకు అర్పితము చేయటము, ఆ తరువాతే తాను భుజించటము! 'కృష్ణార్పణం!' అనింది. ఉడుకు ఉడుకు పాలు త్రాగింది. ఆ పాలలోనున్న వేడికి కృష్ణునికి కాళ్లు కాలిపోయినాయి. సాయంకాలము కృష్ణుడు పవళించాడు. రుక్మిణి పాదసేవ చేస్తున్నప్పుడు పాదములపై బొబ్బలు కనిపించాయి. 'ఏమిటి స్వామి! ఏమిటి ఈ వింతస్వరూపము? ఏమి జరిగింది? ఎవరు నిన్ను ఈ విధంగా హింసించారు?' అని రుక్మిణి అడిగితే 'ఇది నీ పనేను' అన్నాడు. నిన్న చూడవచ్చిన రాధకు 'పాలు చల్లగా ఉన్నాయా లేదా, తాగటానికి సరైనవా కాదా' అని చూసుకోకుండా పాలగ్లాసును అందించావు. ఆ రాధ నాకు అర్పితము చేసింది. దానితో నా కాళ్లు కాలిపోయినాయి' అని చెప్పాడు. కొంతమంది ఇవన్నీ కథలుగా భావిస్తారు. కానీ కథలు కావివి. మానవుని వ్యధలు నిర్మూలము గావించే నిమిత్తము తాను

srisathyasaivachanamrutam

చూపిన దైవలీలలే! కృష్ణలీలలు అన్నీ మానవ వ్యధలను దూరము గావించేవే! ఈ విధంగా భక్తులకే అర్పితముచేస్తూవచ్చాడు కృష్ణుడు, తన శక్తిని. ఇలాంటి పవిత్రమైన భాగవతతత్త్వమును చక్కగా అర్థము చేసుకున్నప్పుడు భగవంతుని శక్తిసామర్థ్యములు స్పష్టముగా మనకు కనిపిస్తాయి.

## దైవార్పితము చేసిన పదార్థము ప్రసాదముగా మారిపోతుంది

మీరా! ఆమె పతి మహారాణా. ఆమె భర్తకు విరోధియైన అక్బరు చక్రవర్తి వచ్చి కృష్ణునికి హారమిచ్చాడని అపోహచేత ఆమెపైన ద్వేషము కల్గింది, ఈ మహారాణాకు. అప్పుడు పాలలో విషము కల్పించి పంపించాడు. అది తాగిన తక్షణమే దేహమంతా నీలంగా మారిపోయి రక్తము నిల్చిపోతుంది. అయితే మీరా ఆ పాలను కృష్ణునికి అర్పితము చేసి త్రాగింది. ఆ విషమంతా కృష్ణుడు తీసుకున్నాడు. మధురమైన పాలు మీరాకందించాడు. అందువల్లే ప్రతి మానవుడు భుజించే సమయంలో 'బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా', అని జపించి భుజించినప్పుడు పాత్రశుద్ధి, పదార్థశుద్ధి, పాకశుద్ధి ఏర్పడతాయి. ఈ బ్రహ్మార్పణంచేత అన్నీ పరిశుద్ధమై పోతాయి. మనము ఏమి భుజించాలన్నా అది దైవార్పితము చేస్తే ప్రసాదంగా మారుతుంది. పదార్థముగా ఉండదు. ఆనాటి గోపికలందరు తమ సర్వస్వము వదలి తమ కర్తవ్యములు తాము నిర్వర్తించుకుంటూ కృష్ణచింతనలోనే జీవితాన్ని గడుపుతూవచ్చారు. వారికి ఎట్టి చదువులు లేవు. ఏ డిగ్రీలు పొందలేదు. ఏ యూనివర్సిటీకి పోలేదు. ఉపనిషత్తులు వారు పఠించలేదు. వారిది ఒకే ఒక ఉపనిషత్తు 'కృష్ణా! కృష్ణా!' అనే ఒకే వాదము; అదే గోపాలా! గోపాలా! అనే ఒకే శాస్త్రము. ఆవిధంగా చింతనచేస్తూ వచ్చినవారే గోపికలు. ఆవిధంగా వారు తమ జన్మలను సార్థకము గావించుకొని ఆనందమును అనుభవించారు. ప్రాపంచిక రీతిగాకూడను వారిలో ఐకమత్యము అంత గొప్పదిగా నిరూపిస్తూ వచ్చారు. భక్తులందరు ఐకమత్యంగా ఉండాలి. జాతిమతకులభేదములు త్యజించాలి. మనలోనున్న పంచభూతములకు ఏ జాతిలేదు. గాలికేజాతి, గగనమునకేజాతి, నీటికేజాతి, నిప్పుకేజాతి? వారందరు ఐకమత్యముతో వచ్చారు. ఐకమత్యము ఎప్పుడు వస్తుంది. Purity ఉండినప్పుడే;

sri sathyasai vachanamrutam

ఈ unity చేరిపోతుంది. purity, unity రెండు చేరటంచేత divinityగా మారిపోతుంది. వ్రేపల్లెకు ఒకనాడు ఒక కొత్త కోడలు వచ్చింది. ఎట్లైనా కృష్ణుని చూడాలని ఆశపడుచూ వచ్చింది. తన హృదయములోని ఆవేదన ఎవరికి చెప్పుకోలేకపోయింది. అత్తమామలకు చెప్పలేకపోయింది. భర్తకు చెబుతే ఏమంటాడో ఏమోనని భయపడిపోయింది. ఆ ఊర్లో ఆచారప్రకారము సంధ్యాసమయంలో శ్రీమంతుల యింటికి వెళ్లి దీపమునంటించుకు రావాలి. నిత్యము అత్తగారు పోయి అంటించుకొని వచ్చేది. 'నీవు యశోద ఇంటికి పోకూడదు. కృష్ణుని చూడకూడదు. అతని భక్తురాలు కాకూడదు', ఈ శాసనము చేస్తూ వచ్చింది, ఆ అత్త. దైవాన్ని చూడకూడదని చెప్పటానికి ఎవరికీ అధికారము లేదు. ఒకరోజు అత్తగారికి high temperature వచ్చింది. కదలటానికి వీలులేకపోయింది. తప్పినదికాదు. 'సుగుణా! వెళ్లి దీపము అంటించుకుని రా!' అంది. 'నా అదృష్టం పండింది. నా హృదయం నిండింది' అనుకుని మనసులో అనేక విధములైన ఆనందము పొందింది. మైమరచి యశోద ఇంటికి పోయింది. యశోద వరండాలో పెట్టిన దీపానికి యీమె దీపము వెలిగింపచేస్తున్నాది. ఆ దీపములో ఏమి చూచిందో ఏమిటో ఈ కొత్తకోడలు తన్మయురాలైపోయింది. చేయికాలిపోతూ వస్తున్నది. లోపలనుంచి యశోద పరుగెత్తి వచ్చింది, చర్మము కాలిన వాసన వస్తున్నాదని. 'అమ్మా! ఏమిటది? దేహము కాలిపోతుంటే కనిపించటంలేదా?' అని అడిగింది. యశోద పలుకులుకూడా వినిపించటంలేదు. కృష్ణునిపై పూర్తిగా మనసు నిలిపింది. కృష్ణుడు నవ్వుతున్నాడు. తాను నవ్వుతున్నాది. బాధ ఏమీ అనిపించలేదు. గోపికలు అందరూ వెళ్లి ఆమెను బయటకు తీసుకువచ్చారు. ఎందుకు ఈ విధంగా చేశావంటే అప్పుడు ఆమె చెప్పింది. 'జ్యోతిలో కృష్ణుడు కనిపించాడు. నన్ను నవ్వించాడు. తాను నవ్వాడు', అని చెప్పింది. ఆడవారినోళ్ళు ఊరకే ఉంటాయా? క్షణములో ఈ వార్త అంతా పాకిపోతూవచ్చింది, న్యూస్‌పేపరు మాదిరి. స్త్రీలంతా చేరారు.

**సుగుణకు కనిపించెనంట నందుని యింట**
**గోపాలుడంట దీపాన కనిపించెనంట**
**అదియె వేలికి తగిలిన మంట ॥సు॥**

sri sathyasai vahini amrutam

జ్వరములోనున్న అత్తకుకూడా తెలిసిపోయింది. ఎవరికైనా తెలియనీ, తానేమో కృష్ణుని చూచింది. అది చాలు తనకు. ఈ విధంగా కృష్ణుని తత్త్వము, కృష్ణుని లీలలు, కృష్ణుని మహత్యములు, కృష్ణుని విభూతులు ఇట్టివి, అట్టివి అని చెప్పటానికి వీలుకాదు. అందరిలో అందరిమాదిరి ఉంటాడు. స్త్రీలలో స్త్రీలమాదిరి, పురుషులలో పురుషులమాదిరి, పిల్లలలో పిల్లలమాదిరి, పెద్దలలో పెద్దలమాదిరి ఉంటున్నాడు.

## మతద్వేషమునకు ఏ మాత్రము అవకాశమివ్వకూడదు

సర్వతః పాణిపాదం. అందరి హృదయమునందు ఉన్నది, భగవంతుడే! భగవంతుని గురించి భేదము ఏమాత్రము పెట్టుకోకూడదు. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'. ఉన్నది ఒక్కటే! రెండుకాదు. 'అల్లా అని చెప్పండి, జీసస్ అని చెప్పండి, జోరాష్ట్రియన్ అని చెప్పండి, బుద్ధుడని చెప్పండి, రాముడు అని చెప్పండి, కృష్ణుడని చెప్పండి, భేదమే వద్దు'. మతములన్నీ ఒకటే! అదే మానవమతము. మన మతులే పాడౌతున్నాయికానీ మతము కాదు. మన మతులను చక్క చేసుకోవాలి. మతద్వేషమునకు ఏమాత్రము అవకాశము యివ్వకండి. ఈ విధమైన భక్తిప్రపత్తులచేత తిరిగి పవిత్రమైన ప్రాచీన భారతీయసంస్కృతిని ఉద్భవింపచేయటానికి మీరు నిర్ణయించుకోండి.

## కృష్ణుని ఆదేశములను మీరు ఆదర్శముగా తీసుకోవాలి

విద్యార్థులారా! ఈ ఏకత్వభావమును ప్రపంచమునకు చాటుతూపోవాలి. భిన్నత్వమునకు అవకాశము యివ్వకూడదు. యిదే నిజమైన చదువు. ఈ చదువు మీరు చదవాలి. అయితే ఈనాడు ఒక విషయయము మీకు తెలుపవలసి వచ్చింది. దినదినమునకు భక్త సమూహం పెరిగిపోతూవస్తున్నాది. వారిని చూడటమే నాకు ఆనందము, నన్ను చూడటమే వారికి ఆనందము. నాకు వ్యవధి ఎక్కువ చిక్కటంలేదు. కనుక, ఎవరైన వివాహములు చేసుకోవాలని యిష్టపడినవారు ఆనందముగా ఎక్కడెక్కడ అనుకూలంగా ఉంటుందో అక్కడక్కడ వివాహాలు చేసుకొని యిక్కడకు వస్తే సంతోషముగా ఆశీర్వదిస్తాను. యికపై ప్రశాంతినిలయంలో వివాహములు జరగటానికి వీలుండదు. సామూహిక వివాహాలు చేస్తాను, సంతోషమే! సామూహిక ఉపనయనములు చేస్తాను,

srisathyasaivachanamrutam

సంతోషమే. ఎప్పుడు చూచినా స్వామిప్రేమ మీకు ఉంటుంది. ఎక్కడ ఉండినా ఆ ప్రేమ మీకందిస్తాను. కానీ, యికపైన యిక్కడ (స్వామిరూములోగానీ యింకెక్కడగాని) వివాహములు స్వామి స్వయంగా దగ్గరుండి జరిపించడానికి వీలుండదు. కళ్యాణమండపములో జరుపుకొండి, దానికి ఏమీ అభ్యంతరము లేదు. మీరు వివాహములు చేసుకొని ఆనందంగా రండి, నేను నిండుప్రేమతో ఆశీర్వదిస్తాను. మీరు గృహస్థులై దేశానికి తగిన ఆదర్శమునందిస్తూ తగిన సేవ చేస్తూ ఏకత్వభావాన్ని ప్రచారము చేస్తూపోవాలి. ఈనాడు గోకులాష్టమి. కృష్ణుడు పుట్టినదినము. కృష్ణుడు పుట్టటము ఏమిటి? బాహ్యస్వరూపానికి పుట్టినదినము. కృష్ణుని ఆదేశాలను మీరు ఆదర్శముగా తీసుకోవాలి. కృష్ణుని ఆజ్ఞ మీరు ప్రధానంగా తీసుకోవాలి. కృష్ణుడు వేరు, కృష్ణుని వాణి వేరుకాదు. స్వామి వేరు, స్వామివాణి వేరుకాదు. స్వామియేవాణి, వాణియే స్వామి. గీతయే కృష్ణుడు, కృష్ణుడే గీత. భేదమునకు అవకాశము యివ్వకండి!

**(తేదీ 04-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam